సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 12 । మే । 2025



బరువెక్కిన బకాయి

తమ హయాంలో చేపట్టిన పనుల బిల్లుల మంజూరు కోసం మాజీ ప్రజాప్రతినిధులు ఎదురుచూస్తున్నారు.
8లో



'భారజలం'లో మాక్ డ్రిల్

భారజల కర్మాగారంలో పోలీసులు, పరిశ్రమ భద్రతా సిబ్బంది ఆదివారం మాక్ డ్రిల్ నిర్వహించారు.
8లో

గరిష్టం / కనిష్టం
42° / 27°

వాతావరణం

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్య కల్యాణ వేడుక ఆదివారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. నిత్యకల్యాణ వేడుకల్లోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్న ప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి పాల్గొన్నారు.

నేడు ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి అశ్వారావుపేట మండలంలో సోమవారం పర్యటిస్తారని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెంలో పర్యటిస్తారని, అనంతరం కన్నాయిగూడెం పంచాయతీ చెన్నాపురం, అనంతరం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న శ్రీ గుబ్బలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుంటారని వివరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

తేనీటి విందుకు హాజరైన మంత్రి సీతక్క



సీతక్కను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి నివాసంలో రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ఆదివారం తేనీటి విందుకు హాజరయ్యారు. తమ నివాసానికి విచ్చేసిన మంత్రిని కేశవరెడ్డి కుటుంబ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

భద్రాచలంవాసికి కవిరత్న పురస్కారం

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి తోటమళ్ల సురేష్ బాబుకు కవిరత్న జాతీయ పురస్కారం లభించింది. ఏపీలోని ఏలూరులో ఈ నెల 10 ,11 తేదీల్లో జరిగిన శ్రీశ్రీ కళావేదిక ప్రపంచ సాహితీ సంబరాల్లో సురేష్‌కు ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్‌లు ఆదివారం అవార్డు ప్రదానం చేశారు. జ్ఞాపికను అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్‌కు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని పీఓ బి. రాహుల్ ఒక ప్రకటనలో సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే దర్బార్‌లో గిరిజనులు ఫిర్యాదులు అందజేయాలని పేర్కొన్నారు.

జామ్‌ఆయిల్‌తో ఆదాయం



కేజీ నూనె రూ.10 వేలు

జామాయిల్ రైతులకు అదనపు ఆదాయం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ గత శుక్రవారం జిల్లాలో ఉన్న కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ప్రకటించారు. యూకలిప్టస్ ఆయిల్ తయారీపై ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం యూకలిప్టస్ ఆయిల్ కేజీ ధర బహిరంగ మార్కెట్‌లో రూ.10,000 వరకు ఉంది. దగ్గు, గొంతు, జలుబు తదితర అనారోగ్య సమస్యలకు దివ్యమైన ఔషధంగా జామాయిల్ నూనెను ఉపయోగిస్తారు. ఇప్పటికీ పల్లెల్లో ఒంటి నొప్పులు తగ్గేందుకు జామాయిల్ ఆకులతో వేడి చేసిన నీటితో స్నానం చేయడం అందరికీ తెలిసిందే. నేల స్వభావం, చెట్టు తీరు, వయసును బట్టి వంద కేజీల ఆకుల నుంచి రెండు కేజీల వరకు యూకలిప్టస్ ఆయిల్‌ను తీసే వీలుంది.

ఆకులతో నూనె తయారీపై దృష్టి

- ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక
- రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా కలెక్టర్ చొరవ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా జామాయిల్ సాగవుతోంది. ఇప్పటి వరకు జామాయిల్ కలప అమ్మడం ద్వారానే రైతులకు ఆదాయం వస్తోంది. తాజాగా జామాయిల్ ఆకుల ద్వారా కూడా ఆదాయం వచ్చే మార్గాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

ఐటీసీ ఆధారంగా జామాయిల్

దేశంలో ప్రముఖ కార్పొరేట్ కంపెనీల్లో ఉన్న ఐటీసీ సంస్థ సారపాకలో పేపర్ బోర్డు, స్పెషల్ పేపర్ డివిజన్ పేరుతో కర్మాగారం స్థాపించింది. ఈ సంస్థలో పేపర్ తయారీకి ముడి సరుకుగా యూకలిప్టస్ (జామాయిల్) కలపను ఉపయోగిస్తారు. దీంతో ఈ పరిశ్రమ వచ్చిన తర్వాత జిల్లాలో జామాయిల్ సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో 27 వేల ఎకరాల్లో జామాయిల్ పంట సాగు చేస్తున్నారు. ఒకసారి మొక్కను నాటితే మూడున్నరేళ్ల నుంచి చెట్లను నరికి కలపను అమ్ముకోవచ్చు. ఒక్కసారి పంటను నాటితే కనీసం మూడు దఫాలుగా అంటే పది నుంచి పన్నెండేళ్లపాటు దీన్ని సాగులో ఉంచుకోవచ్చు. ప్రస్తుతం జామాయిల్ సాగు చేస్తున్న రైతులు ప్రతీ మూడేళ్లకు ఒకసారి ప్రతిఫలం పొందుతున్నారు. సగటున ఒక ఎకరానికి కనిష్టంగా రూ.2.5 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అంతకు మించి మరే విధమైన ఆదాయం లేదు.

కుటీర పరిశ్రమలకు ఊతం

ఐటీసీ పేపర్ బోర్డు పరిశ్రమలో వేస్టేజ్‌గా వచ్చిన కలప గుజ్జు ఆధారంగా బూర్గంపాడు మండలంలో పదుల సంఖ్యలో అట్టల తయారీ పరిశ్రమలు వచ్చాయి. కోడిగుడ్ల రవాణా, నిల్వకు ఉపయోగించే కాగితపు అట్టలు ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా సరఫరా అవుతున్నాయి. అదే విధంగా ప్యాకేజీ అట్టలు కూడా ఇక్కడే రూపొందుతున్నాయి. ఫలితంగా బూర్గంపాడు మండలంలో సంజీవరెడ్డి పాలెం, లక్ష్మీనగరం, రెడ్డిపాలెం వంటి గ్రామాల్లో అనేక కుటీర పరిశ్రమలు వచ్చాయి. ఇప్పుడు ఆయిల్ తయారీ విధానం విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో కుటీర పరిశ్రమలు వచ్చేందుకు ఆస్కారముంది. ఇప్పటికే మునగ సాగు – మునగ ఆకు మార్కెటింగ్‌పై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఈ రెండు ప్రయోగాలు సానుకూల ఫలితాలు ఇస్తే జిల్లాకు మరింత మేలు జరగనుంది.

ఉపాధి, అదనపు ఆదాయం

జిల్లాలో రైతులతోపాటు సింగరేణి సంస్థ కూడా కలప అవసరాల కోసం పెద్ద ఎత్తున యూకలిప్టస్ చెట్లను పెంచుతోంది. మూసివేసిన ఓపెన్‌కాస్ట్ గనులు, సంస్థ ఆధీనంలో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో యూకలిప్టస్ చెట్లు విరివిగా ఉన్నాయి. అంతా కలిపితే ముప్పై ఐదు వేలకు పైగా ఎకరాల్లో జామాయిల్ సాగవుతోంది. కేవలం కలప తప్ప ఇప్పటివరకు ఆకుల వినియోగంపై దృష్టి సారించలేదు. ప్రస్తుతం కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని అమల్లోకి తీసుకువచ్చి ఆయిల్ తయారీపై శిక్షణ ఇస్తే రైతులకు అదనపు ఆదాయం రావడంతోపాటు కుటీర పరిశ్రమ తరహాలో జిల్లా ప్రజలకు ఉపాధి, అదనపు ఆదాయం లభించే అవకాశం ఏర్పడుతుంది.

రేపు పాలిసెట్

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 13న పాలిసెట్ -2025 పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సెట్ కన్వీనర్ బండి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలో 11 కేంద్రాల్లో 3,356 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో 6, భద్రాచలంలో 2, మణుగూరులో 3 సెంటర్లను ఏర్పాటు చేశామని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని వివరించారు. పరీక్షకు రెండు గంటల ముందు కేంద్రానికి రావాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమని తెలిపారు. విద్యార్థులు హెచ్‌బీ పెన్సిల్, ఎరేసర్, పెన్సిల్ షార్ప్‌నర్, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్, హాల్‌టికెట్ మాత్రమే తెచ్చుకోవాలని సూచించారు.



పాలిసెట్ కన్వీనర్ శ్రీనివాస్

'భరోసా' కోల్పోతున్నారు..

- యాసంగి సాగు ముగిసినా అందని పెట్టుబడి సాయం
- నాలుగెకరాలు పైబడిన రైతులకు జమకాని రైతు భరోసా
- నాలుగు నెలలుగా కర్షకుల ఎదురుచూపులు



యాసంగి వరినాట్లు వేస్తున్న కూలీలు (ఫైల్)

బూర్గంపాడు: యాసంగి పంటల సాగు ముగిసినా రైతు భరోసా పెట్టుబడి సాయం మాత్రం ఇంకా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి 26 నుంచి పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమచేయటం ప్రారంభించింది. ఇప్పటివరకు నాలుగు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే అందించింది. ఆ పైబడిన రైతులకు రైతు భరోసా అందలేదు. ఎప్పుడు అందుతుందో కూడా స్పష్టత లేదు. దీంతో జిల్లాలో వేలాదిమంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.


అర్హులు 1,39,192 మంది

జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాలతో భూమి హక్కులు కలిగిన రైతులు 1,39,192మంది ఉన్నారు. వీరికి గతంలో ఎకరాకు రూ.5 వేల చొప్పున 4.30 లక్షల ఎకరాలకు రూ.215 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ యాసంగి సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.6వేలకు పెంచింది. తొలుత జిల్లాలో మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని పెట్టుబడి సాయాన్ని అందించారు. తర్వాత ఫిబ్రవరిలో ఎకరం, రెండెకరాల భూమి ఉన్న రైతులకు జమ చేశారు. మార్చిలో మూడెకరాలోపు రైతులకు, ఏప్రిల్‌లో నాలుగెకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా అందించారు. మొత్తంగా నాలుగెకరాల లోపు భూమి ఉన్న రైతులకు రూ.128 కోట్లు జమ చేశారు. కానీ నాలుగెకరాల పైబడిన రైతులకు రూ.117 కోట్ల వరకు జమ కావాల్సి ఉంది. యాసంగి పంటలు సాగు ముగిసి మరో 20 రోజుల్లో వానాకాలం పంటల సాగు మొదలవుతుంది. అప్పటివరకైనా రైతు భరోసా అందుతుందా లేదా అని రైతుల్లో చర్చ సాగుతోంది.

వానాకాలం సీజన్ సమీపిస్తున్నా..

జిల్లాలో ఎక్కువగా మెట్ట భూములు, పోడు భూములు ఉన్నాయి. చిన్న సన్నకారు రైతులే 70 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. వీరికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన రైతుబంధు పథకంతో పెట్టుబడి సాయమందింది. వానాకాలం, యాసంగి పంటల సాగుకు నెలన్నర రోజుల్లో రైతులందరికీ పెట్టుబడి సాయం అందించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ. 6 వేల చొప్పున పెంచి రైతులకు రైతు భరోసా అందజేస్తోంది. కాగా యాసంగిలో పెట్టుబడిసాయం అందజేత ప్రక్రియ నాలుగు నెలలుగా కొనసాగుతోంది. మరో వైపు వానాకాలం సీజన్ సమీపిస్తున్నా అందరికీ అందకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.


నాలుగు నెలలైనా రాలేదు..



జనవరిలో రైతు భరోసా ప్రారంభించారు. ఇప్పటివరకు నాలుగెకరాల పైబడిన రైతులు పెట్టుబడి సాయం అందలేదు. నాలుగు నెలలుగా వస్తుందని ఆశగా చూస్తున్నాం. అసలు వస్తుందో రాదో అర్థం కావటం లేదు.

– యదమకంటి లింగారెడ్డి, రైతు, రెడ్డిపాలెం

తక్షణమే జమచేయాలి



రైతు భరోసా కొందరికి జమ చేసి మరికొందరికి జమచేయక పోవటం సరికాదు. పెట్టుబడుల సమయంలో సాయం అందించాల్సిన సాయం పంటల సాగు పూర్తయినా ఇవ్వకపోవటం దారుణం. తక్షణమే జమ చేయాలి.

– పున్నం చంద్, న్యూడెమోక్రసీ నాయకుడు

'ఉద్దీపకం'తో సత్ఫలితాలు

- గతేడాది 3,4,5 తరగతుల విద్యార్థులకు పంపిణీ
- రానున్న ఏడాది 1, 2వ తరగతుల్లో అమలుకు ప్రణాళికలు
- ప్రాథమిక విద్య పటిష్టతపై పీఓ దృష్టి



గిరిజన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ (ఫైల్)



గణితం, ఇంగ్లిష్ ఉద్దీపకం వర్క్‌బుక్‌లు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ప్రాథమిక విద్య పటిష్టతకు పీఓ చేపట్టిన ప్రయోగం ఫలించింది. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో గిరిజన విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దీపకం అభ్యాసన పుస్తకాలు అందించారు. మెరుగైన ఫలితాలు కనిపించడంతో ఈయేడాది మిగతా తరగతులకు కూడా అందించాలని భావిస్తున్నారు.

విద్యార్థుల్లో వెనుకబాటును గుర్తించి..

తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యపై అవగాహన ఉన్న బి.రాహుల్ ఐటీడీఏ పీఓగా బాధ్యతలు చేపట్టాక ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించారు. గిరిజన విద్యార్థులతో మమేకమై వారి ప్రతిభా పాటవాలను పరిశీలించారు. ప్రాథమిక విద్యలో వారి వెనుకబాటుతనాన్ని గుర్తించారు. గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం లేకపోవడంతో ప్రాథమిక విద్య పటిష్టతకు చర్యలు చేపట్టారు.

పునాది బలపడేలా 'ఉద్దీపకం'

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థుల సామర్థ్యాలు బలంగా ఉండేందుకు ఉద్దీపకం పేరిట ప్రత్యేక అభ్యాసన పుస్తకాలను తీసుకొచ్చారు. ఇందుకోసం పీఎంఆర్‌సీ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక పుస్తకాలను సిద్ధం చేయించారు. తొలి విడతగా 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. గణితంలో కూడిక, తీసివేత, భాగహారం, హెచ్చవేతల ఆవశ్యకత, వాటిని సులువుగా వినియోగించటం, లెక్కల ప్రశ్నలను సులువుగా సాధించడం, ఉన్నత విద్యకు ప్రాథమిక స్థాయిలో గణితం పునాది, నిత్య జీవితంలో లెక్కలను వినియోగించడం వంటి అంశాలపై వర్క్‌షీట్లతో బుక్‌లను సిద్ధం చేయించారు. ఇంగ్లిష్‌లో గ్రామర్‌పై పట్టు, సులువుగా వాక్యాల కూర్పు, పద వినియోగం పెంపు, రీడింగ్ అండ్ రైటింగ్ స్కిల్స్ పెంచే విధంగా రూపొందించారు. ఇంగ్లిష్ నిర్భయంగా మాట్లాడేలా అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని ఈ వర్క్‌షీట్లలో పొందుపర్చారు.

సత్ఫలితాలతో 1,2 తరగతులకు అమలు

2024లో పాఠశాలల ప్రారంభం సమయానికి వర్క్‌బుక్‌లను సిద్ధం చేయించి 3,4,5 తరగతుల విద్యార్థులకు అందించారు. ఆశ్రమ పాఠశాలలను సందర్శిస్తూ బోధనా తీరును పర్యవేక్షించారు. ఉద్దీపక పుస్తకాలతో సత్ఫలితాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది 1, 2వ తరగతులకు కూడా ఉద్దీపనం పుస్తకాలు ఇవ్వాలని భావిస్తున్నారు. సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయులతో సమీక్షించి వర్క్‌షీట్లు సిద్ధం చేయాలని సూచించారు. తుది పరిశీలన అనంతరం ఆమోదించి పుస్తకాల రూపంలోకి తీసుకురానున్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి పాఠశాలల పునః ప్రారంభం సమయంలోనే పుస్తకాలు అందించాలనే కృతనిశ్చయంతో ఐటీడీఏ అధికారులు దృష్టి సారించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



డీర్ పార్కులోని దుప్పులను వీక్షిస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 406 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.22,885 ఆదాయం లభించింది.

మరమ్మతులకు గురైన బోట్లు

కిన్నెరసానిలో మూడు బోట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఇంజన్ చెడిపోవడంతో నెల రోజుల క్రితం స్పీడ్ బోటును మరమ్మతుల నిమిత్తం హైదరాబాద్‌కు పంపారు. ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదు. తాజాగా ఆదివారం 50 మంది సామర్థ్యం కలిగిన పెద్ద బోటు, మరో చిన్న బోటు ఇంజన్లు కూడా చెడిపోయాయి. దీంతో జలాశయంలో బోటు షికారు నిలిచిపోయింది. ఫలితంగా పర్యాటకులు నిరాశకు గురయ్యారు. వేసవి సెలవులు కావడంతో పర్యటకుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం సుమారు రూ. 15 వేల ఆదాయం కోల్పోయినట్లు తెలుస్తోంది. అయినా టూరిజం కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడంలేదు.

క్లుప్తంగా

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన అనుబంధ ఆలయమైన యోగానంద లక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజరోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయంలో అభిషేకం, కుంకుమ పూజ, పుష్పార్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ, ఎదుర్కోలు కార్యక్రమాలకు నిర్వహించాక స్వామివారిని పుర వీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి పాల్గొని పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



వెంకన్న(ఫైల్)

కారేపల్లి: కారేపల్లి భారత్‌నగర్ కాలనీకి చెందిన వేమూరి వెంకన్న(53) వడదెబ్బతో మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆయన ఆదివారం ఎండ తీవ్రత తట్టుకోలేక వడదెబ్బతో మృత్యువాత పడ్డాడు. కాగా, మృతుడు సింగరేణి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అరుణాచలంలో జిల్లా యువకుడు మృతి

గిరిప్రదక్షిణ, దర్శనానంతరం గుండెపోటు..



రాకేశ్ శర్మ(ఫైల్)

జూలూరుపాడు: జూలూరుపాడుకు చెందిన యువకుడు తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో గుండెపోటుతో ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు తెలికిచెర్ల మధుకుమార్ శర్మ కుమారుడు రాకేష్ శర్మ(33) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. ఈనెల 9న తల్లి భవానితో కలిసి అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. ఆదివారం అక్కడ గిరి ప్రదక్షిణ చేసి, స్వామివారి దర్శనానంతరం తిరిగి అద్దెకు తీసుకున్న రూమ్‌కు వెళ్లే క్రమంలో గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఆనంద శ్వేత, మూడేళ్ల కూతురు, ఆరు నెలల కుమారుడు ఉన్నారు. కుమారుడికి ఇటీవలే పాపకొల్లు ఆలయంలో అన్నప్రాసన వేడుక నిర్వహించాక, భార్య.. పిల్లలను తీసుకుని పుట్టింటికి కాకినాడ వెళ్లింది. రాకేశ్ తల్లితో కలిసి దైవ దర్శనానికి వెళ్లగా, అక్కడే తుదిశ్వాస విడిచాడు. కుమారుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు మధుకుమార్ శర్మ అరుణాచలం బయలుదేరారు. సోమవారం సాయంత్రానికి జూలూరుపాడు చేరుకోనున్నారు. కాగా, మాతృ దినోత్సవం రోజునే పుత్రుడికి కోల్పోయిన తల్లి భవానీ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అతడి మృతితో జూలూరుపాడు, పాపకొల్లు గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి.

నల్లచట్టాలతో రైతులకు నష్టం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



మాట్లాడుతున్న రాఘవులు, పక్కన మల్లు రవి, తమ్మినేని తదితరులు

కొణిజర్ల : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్లచట్టాలతో రైతులు నష్టపోతున్నారని, వీటిని నిరసనగా రైతులతో పాటు కార్మికులు కూడా ఉద్యమిస్తున్నారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. ఇటీవల భారత్ – పాకిస్తాన్ మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న పరిస్థితుల్లో చర్చల ద్వారా సమస్య పరిష్కరించాలని కమ్యూనిస్టులు సూచిస్తే దేశ ద్రోహులుగా చిత్రకరించేందుకు కొందరు ప్రయత్నించారని ఆరోపించారు. మండలంలోని లాలాపురంలో సీపీఎం నాయకుడు సంక్రాంతి మధుసూదనరావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించగా రాఘవులు మాట్లాడారు. యుద్ధంతో తీవ్ర నష్టాలు ఉంటాయని, రెండు దేశాల మధ్య సయోధ్యతో యుద్ధాన్ని నివారించొచ్చని కాంగ్రెస్ సహా ఇండియా కూటమిలోని పార్టీలన్నీ చెప్పాయన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ కమ్యూనిస్టులు లేకపోతే దేశానికి భవిష్యత్ ఉండదనే చర్చ జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చెబుతున్న ముఖ్యమంత్రి రూ.వేలకోట్లు ఖర్చు పెట్టి అందాల పోటీలు నిర్వహించడం అవసరమా అని ప్రశ్నించారు. నాగర్ కర్నూల్ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ తాను కాంగ్రెస్ వాదినైనా మధుసూదనరావు ఆలోచనా విధానాన్ని అవలంబించేవాడినని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్, సాయిబాబా, నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

బరువెక్కిన బకాయి..!

పెండింగ్ బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం

- రూ.10 లక్షలలోపు బిల్లులు చెల్లిస్తామని హామీ
- నాలుగు నెలలవుతున్నా పట్టించుకోని సర్కారు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు



ధన్‌బాద్ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: గత ప్రభుత్వం హయాంలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టిన సర్పంచులకు పెండింగ్ బిల్లులు కొంత మేర చెల్లిస్తామని గతేడాది డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2023 డిసెంబర్ 7 వరకు ప్రజాప్రతినిధులు చేసిన రూ.10 లక్షలలోపు పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని చెప్పడంతో మాజీ సర్పంచులు నాలుగు నెలలుగా బకాయిల కోసం ఆశతో నిరీక్షిస్తున్నారు. బయట నుంచి వడ్డీకి అప్పులు తెచ్చి ఆర్థికంగా నష్టపోయామనే ఆవేదనలో ఉన్నారు.

తప్పని నిరీక్షణ..

జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక్కో మేజర్ పంచాయతీ పరిధిలో రూ.10 నుంచి రూ.15 లక్షలు వరకు, చిన్న పంచాయతీల్లో అయితే రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ. 50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు బిల్లులు ప్రజాప్రతినిధులకు రావాల్సి ఉంది. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా జిల్లాకు అందిస్తున్న రూ.9.32 కోట్ల పల్లె ప్రగతి నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్‌ల నిధులు కేవలం సిబ్బంది జీతభత్యాలు, ఇతర అవసరాలకే సరిపోతున్నాయి. అప్పట్లో గడువులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశాలు రావడంతో రూ.అప్పులు చేసి మరీ పూర్తి చేసినా నేటికీ బిల్లులు రాక మాజీ సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తలలు పట్టుకుంటున్నారు. పల్లె ప్రగతి కింద చేపట్టిన బిల్లులు భారీగా ఉండడంతో.. ఈ ఏడాది జనవరి 31తో సర్పంచ్‌ల పదవికాలం ముగిసిన నాటి నుంచి బిల్లుల కోసం పోరాడుతూనే ఉన్నారు.

పల్లె ప్రగతి పనులకు పెట్టుబడి

జిల్లాలో 3వేల నుంచి 4 వేల జనాభా ఉన్న జీపీలు 14 ఉండగా, 4 వేల నుంచి 5 వేలు ఎనిమిది, 5 వేల నుంచి 10 వేలు 10 వరకు ఉన్నాయి. 10 వేలకు పైగా ఏడు జీపీలు ఉండగా, 500లోపు 32 వరకు ఉన్నాయి. మిగిలిన 410 జీపీల్లో 500 నుంచి 3 వేల వరకు జనాభా కలిగి ఉన్నాయి. అయితే గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను ప్రభుత్వం ఉపాధిహామీతో అనుసంధానం చేసింది. పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయించారు. వీటిలో వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల పనులను స్థానికంగా సర్పంచులే అప్పులు చేసి మరీ చేపట్టగా.. 70 శాతం నిధులు మాత్రమే చెల్లించారు. ఇక పంచాయతీ ట్రాక్టర్ల డీజిల్‌కు నెలకు రూ.8 వేల నుంచి రూ.16 వేల వరకు ఖర్చయ్యేవి. వీటితో పాటు తాగునీరు నిర్వాహణ, ఇతర అత్యవసరాలకు సంబంధించిన కొన్ని బిల్లులు కూడా రావాల్సి ఉంది.

మళ్లీ ఆందోళన బాట?

2024 ఫిబ్రవరి 2 నుంచి గ్రామ పాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లడంతో సర్పంచుల్లో కొంత ఆందోళన నెలకొంది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వానికి తమను ఆదుకోవాలని మొర పెట్టుకోగా ఎట్టకేలకు రూ.10 లక్షలలోపు పెండింగ్ బిల్లులు చెల్లించే ఆలోచన చేస్తున్నట్లు గతేడాది డిసెంబర్‌లో ప్రకటన విడుదల చేసింది. దీంతో జిల్లాలో దాదాపు రూ.20 కోట్ల మేర బిల్లులకు మోక్షం కలుగుతుందని భావించినా నిరాశే మిగిలింది. ప్రభుత్వం హామీ ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా వాటి ఊసెత్తకపోవడంతో మళ్లీ మాజీ సర్పంచులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం..



పల్లె ప్రగతిలో భాగంగా ధన్‌బాద్ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులకు దాదాపు రూ.6 లక్షల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉంది. పనులు పూర్తి చేసేందుకు అప్పు చేసి మరీ పూర్తి చేసినా నేటికీ బిల్లులు రాక ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. కొత్త ప్రభుత్వం కొంతమేర బిల్లులు చెల్లిస్తామని చెప్పింది కానీ ఇంతవరకు విడుదల చేయలేదు. వెంటనే బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.

– బానోత్ రాందాస్, మాజీ సర్పంచ్, ధన్‌బాద్

ఉద్యమకారులు అధైర్యపడొద్దు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్ పక్కన నాయకులు

టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్

ఖమ్మం మామిళ్లగూడెం : జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ అధైర్యపడొద్దని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ సదస్సులో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చెప్పిన మోసపూరిత మాటల వల్లే నేడు ఆయన ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చిందన్నారు. కొట్లాడి సాధించిన రాష్ట్రంలో అసలైన ఉద్యమకారులను నేడు వెనక్కు నెట్టేశారని విమర్శించారు. ఎంతోమంది విద్యార్థులు, ప్రజల ఆత్మబలిదానాలతో సాధించిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబమే పెత్తనం చేసిందని అన్నారు. తనకు ప్రస్తుత ప్రభుత్వంలో అయినా కాస్త గుర్తింపు రావడంతో ఉద్యమకారుల పక్షాన శాసనమండలిలో మాట్లాడగలుతున్నామని చెప్పారు. ప్రతీ ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని హామీ దక్కిందన్నారు. సదస్సులో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు, పల్లె వినయ్‌కుమార్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి. కృష్ణారావు, నాయకులు పసుపులేటి నరసయ్య, మహబూబ్ బాషా, ప్రసాద్, అక్బర్, డేవిడ్, సయ్యద్ సలీంపాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా మధిర నియోజకవర్గానికి చెందిన షేక్ సర్దార్ హుస్సేన్‌ను నియమిస్తున్నట్లు కోదండరామ్ ప్రకటించారు.

మీటర్ రీడింగ్ కార్మికుల వినతి..

రాష్ట్ర విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు కోదండరామ్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో సుమారు 2వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, విద్యుత్ సంస్థకు ఆదాయం సమకూరుస్తున్న తమకు సరైన న్యాయం జరగడం లేదని ఆయన దృష్టికి తెచ్చారు. పీస్‌రేట్ పద్ధతి కాకుండా నెలవారీ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరారు. నాయకులు వేమూరి వీరయ్య, నాగేశ్వరావు, అనిల్, మల్లేశ్వరరావు, వంశీ, నాగార్జున, బాలు, నరేష్, నవీన్, మధు పాల్గొన్నారు.

ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూం ప్రారంభం



ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూంను ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్: కరీంనగర్ నగరంలోని విట్స్ కళాశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన బుల్ కన్స్‌ట్రక్షన్స్ ఎక్విపెమెంట్ ఏజేఆర్ ఆటోమోటివ్స్ షోరూంను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బుల్ మిషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ జోన్ హెడ్ వి.సోమసుందరం, స్టేట్‌హెడ్ ఎస్.సురేశ్ బాబు, షోరూం డీలర్ అంబటి జోజిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. బుల్ కంపెనీకి సంబంధించి ఒక స్టాండర్డ్ పోర్ట్, స్టాండర్డ్ క్వాలిటీ, మంచి పర్ఫార్మెన్స్ ఉంటుందన్నారు. బుల్ కన్స్‌ట్రక్షన్స్ ఎక్విప్‌మెంట్ ద్వారా గంటకు లీటర్ డీజిల్ ఆదా చేయడం జరుగుతుందన్నారు. సర్వీస్ విషయంలోనూ 100శాతం క్వాలిటీ అందిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్ జగ్గారెడ్డి, ఫాదర్ సంతోష్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సుక్కో (ఫైల్)

టేకులపల్లి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందాడు. టేకులపల్లి ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రేగుల తండాకు చెందిన ధరావత్ సుక్కో(45) కూరగాయలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గత పదేళ్ల నుంచి మద్యానికి బానిసకావడంతో ఇంట్లో తరచూ గొడవలు అయ్యేవి. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా అతడు మద్యం సేవించి ఇంటికి రాగా తీవ్రస్థాయిలో గొడవై కొట్టుకున్నారు. కొంత సమయం తర్వాత మృతుడి చిన్న కొడుకు అరుణ్ తన మేనత్త కొడుకు కల్యాణ్‌కు ఫోన్ చేసి తన తండ్రి ఉరివేసుకుని చనిపోయాడని చెప్పారు. వెంటనే మృతుడి చెల్లి బానోత్ బుజ్జి ఆమె కొడుకు కల్యాణ్‌లు సుక్కో ఇంటికి వెళ్లి చూడగా.. ఇంటి ముందు రేకుల వరండాలో ఉరి వేసుకుని కనిపించాడు. సుక్కోను కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కగా, మృతుడి ముఖంపై ఉన్న దెబ్బలను చూసి ఇది ఆత్మహత్య కాదని కొడుకు తరుణ్, భార్య విజయలు కలిసి చంపి ఊరేసినట్లుగా ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మనస్తాపంతో యువకుడు..



సంతోష్ (ఫైల్)

పాల్వంచరూరల్: తల్లి మరణాన్ని జీర్ణించుకోలేని ఓ యువకుడు మనస్తాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి రేగులగూడెం గ్రామానికి చెందిన మక్కటి సంతోష్(24) గత నాలుగేళ్ల క్రితం తన తల్లి అంజమ్మ మరణించగా.. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా.. కుటుంబీకులు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడిసోదరి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

మధిర: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మాటూరు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మానుకొండ తిరుపతమ్మ (30) సుమారు పదేళ్ల క్రితం ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన స్కూల్ వ్యాన్ డ్రైవర్ శ్రీనివాసరావును కులాంతర వివాహం చేసుకుంది. వారికి ఒక కుమార్తె ఉంది. ఇటీవల భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం తిరుపతమ్మ పుట్టింటికి వెళ్లగా.. పెద్ద మనుషుల సమక్షంలో ఆదివారం మాట్లాడుకునేందుకు భర్త, ఆయన తరఫు బంధువులు వస్తున్నారే విషయం తెలుసుకున్న ఆమె మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదు పశువులు మృతి

ముదిగొండ: ఖమ్మం–కోదాడ జాతీయ రహదారిపై ముదిగొండ, వెంకటాపురం గ్రామాల సమీపాన గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఆదివారం నాలుగు గేదెలు, ఒక దూడ మృతి చెందగా.. మరో గేదెకు గాయాలయ్యాయి. ఇవి ముదిగొండ, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు వినోద్‌బాబు, ఉపేందర్‌కు చెందిన గేదెలు కాగా గాయపడిన గేదెకు స్థానిక పశువైద్యసిబ్బంది వైద్య చికిత్స నిర్వహించారు.

వేసవి సెలవులు యమపాశమై..

బస్సు కిందపడి ఒక్కరు మృతి, మరొకరికి స్వల్ప గాయాలు

అశ్వారావుపేటరూరల్: తన చెల్లిని వేసవి సెలవులకు ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన ఓ వ్యక్తిని బస్సు రూపంలో అతడి పాలిట యమపాశమైంది. బస్సును ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో దాని కింద పడి మృత్యువాతపడగా... మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటనా వివరాలనను బంధువుల ఇలా తెలిపారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన నామాల బాబ్జీ(32), అశ్వారావుపేట నందమూరినగర్‌లో ఉండే తన చెల్లి జాలది క్రాంతిరేఖను వేసవి సెలవుల నేపథ్యాన తన స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు శనివారం ఉదయం వచ్చాడు. అయితే తన బావ జాలాది పవన్‌తో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట నుంచి నందమూరినగర్ వైపు వెళ్తున్న క్రమంలో జంగారెడ్డిగూడెం మార్గంలోని చెక్‌పోస్టు వద్ద బస్సును ఓవర్‌టేక్ చేయబోయాడు. ఇదే సమయంలో జీలుగుమిల్లి వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఐచర్ వ్యాన్‌ను ఢీకొట్టి ఆపై బస్సు టైరు కింద పడిపోయారు. టైరు బాబ్జీ మీదుగా వెళ్లడంతో తీవ్రగాయాలు కాగా పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బాబ్జీ మృతి చెందాడు. మృతుడి చెల్లి కాంతిరేఖ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు.

భార్య మరణాన్ని తట్టుకోలేక మృతి

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన తాళ్లూరి చిన్న వెంకటరత్నమ్మ(75) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేక మనోవేదనకు గురైన ఆమె భర్త తాళ్లూరి సత్యమయ్య(85) ఆదివారం మృతి చెందాడు. రెండు రోజుల వ్యవధిలోనే వృద్ధ దంపతులు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

చికిత్స పొందుతూ యువకుడు..



సాంబ దేవేంద్ర (ఫైల్)

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామానికి చెందిన తాళ్ల సాంబ దేవేంద్ర (19) అదే గ్రామానికి చెందిన మరో యువకుడితో కలసి రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై దమ్మపేట నుంచి మందలపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బైకు అదుపు తప్పి అయ్యప్ప స్వామి ఆలయ సమీపాన డివైడర్‌ను బలంగా ఢీ కొట్టటా.. సాంబ దేవేంద్ర తలకు బలమైన గాయం కావడంతో విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఖమ్మంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. కాగా, అతడిది నిరుపేద కుటుంబం కావడంతో వాట్సాప్ గ్రూపుల ద్వారా అతడి శస్త్ర చికిత్స నిమిత్తం విరాళాల రూపంలో రూ. 1.40 లక్షలను స్థానిక యువకులు సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు. అయినా అతడి ప్రాణం నిలవకపోవడంతో స్థానిక యువకులు కన్నీటి పర్యంతమయ్యారు.

● చిన్నారుల ‘చల్లని’ సేవ



ట్రాక్టర్‌పై వెళ్తున్న వారికి నిమ్మరసం అందిస్తున్న చిన్నారులు

మండుటెండలో పయనించే బాటసారులకు దాహార్తి తీరుస్తూ చిన్నారులు తమ గొప్ప మనసును చాటుకున్నారు. మండల కేంద్రంలోని చింతలబజార్‌కు చెందిన చిన్నారులు చంద్ర వినిత్, పున్నం సాత్విక్, వరిమట్ల రాము, బొల్లం మనోజ్, గోకినపల్లి నిక్కి తమకు తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులతో వృథా ఖర్చు చేయకుండా మజ్జిగ, నిమ్మరసం తయారు చేసి బాటసారులకు అందిస్తున్నారు. అశ్వాపురం మెయిన్ రోడ్డు నుంచి జగదాంబ సెంటర్ మీదుగా కాలువబజార్, హైస్కూల్ సెంటర్, ఎస్సీ కాలనీ, తురుములగూడెం, గొందిగూడెం గ్రామాల ఉపాధి హామీ కూలీలకు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనదారులను ఆపి మరీ అందిస్తుండగా.. పలువురు అభినందిస్తున్నారు. – అశ్వాపురం

భారజల కర్మాగారంలో మాక్ డ్రిల్



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

అశ్వాపురం: దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం మణుగూరు భారజల కర్మాగారంలో మాక్ డ్రిల్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారజల కర్మాగారం ఉద్యోగుల పని ప్రదేశం, కాలనీలో అలారం సిస్టం వినియోగించినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ అమిత్‌కుమార్, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై మధుప్రసాద్, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది, అశ్వాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యల సాధనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న త్యాగరాజన్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికుల సమస్యల సాధనకు ఐఎన్‌టీయూసీ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ పేర్కొన్నారు. ఆదివారం పోస్టాఫీస్ సెంటర్‌లోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో గత రెండు రోజుల క్రితం యూనియన్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యాన రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.బలరామ్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇన్‌కమ్ టాక్స్ మాఫీ, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు, కార్పొరేట్ మెడికల్ బోర్డు మార్పు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో సవరణ, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ నిర్మాణం, సింగరేణి ఆధ్వర్యాన ఐటీ కంపెనీ స్థాపన, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, పెండింగ్ కేసులు పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆల్బర్ట్, ఏరియా ఉపాధ్యక్షులు పీతాంబరం, ఎండీ రజాక్, బ్రాంచ్ సెక్రటరీ లలిత, చిలక రాజయ్య, డేవిడ్ రాజు, సీతారామరాజు, రాయమల్లు పాల్గొన్నారు.

వృద్ధులపైకి దూసుకెళ్లిన కారు..

సత్తుపల్లిరూరల్: ఇంటి ముందు కూర్చున్న వృద్ధులపైకి ఓ కారు దూసుకెళ్లడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భద్రాచలం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి మండలం లింగగూడెంకు చెందిన నవవధువులు భద్రాద్రి రాములోరిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బుగ్గపాడులో ఇంటి ముందు కూర్చున్న తాటి వీరమ్మ, గడ్డం చిన్నప్ప వృద్ధులను కారు అదుపు తప్పి ఢీ కొట్టింది. ఇరువురికి తీవ్ర గాయాలు కాగా వారిని 108లో సత్తుపల్లికి తరలించారు.